## క్లుప్తంగా

### ముమ్మరంగా పత్తి సేకరణ



దొరజమ్మలో పత్తిని సేకరిస్తున్న మహిళలు

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో పత్తి సేకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ పంటల్లో భాగంగా వాణిజ్య పంటైన పత్తిని మండల వ్యాప్తంగా సుమారు 326 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పత్తి దిగుబడి బాగా వచ్చినందున ఆయా గ్రామాల్లో పత్తిని సేకరించే పనిలో రైతులు, మహిళలు నిమగ్నమయ్యారు.

### పెదరామలో పారిశుద్ధ్య పనులు



బావిలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: పెదరామలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ తిరుపతి రావు ఆధ్వర్యంలో కాలువలు శుభ్రం చేశారు. బ్లీచింగ్ చల్లారు. అలాగే బావులు, బోర్లలో క్లోరినేషన్ చేపట్టారు. గ్రామ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ పరిసరాలను ప్రతీ ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామాల్లో గంగిరెడ్ల సందడి



గద్దికాలనీలో గంగిరెడ్ల సందడి

గుమ్మలక్ష్మీపురం: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో బసవన్నలు (గంగిరెడ్లు) సందడి చేస్తున్నాయి. పలువురు వ్యక్తులు తమకున్న ఎడ్లను గంగిరెడ్లుగా ముస్తాబు చేసి మండల పరిధిలోని గ్రామాల్లోని ఇంటింటికీ వాటిని తీసుకెళ్తున్నారు. గ్రామస్తులంతా ఇంటి ముందుకు వచ్చిన బసవన్నకు పూజలు చేస్తూ, కానుకలను సమర్పిస్తున్నారు. అలంకరణతో ఉన్న గంగిరెడ్లను చూసేందుకు చిన్నారులంతా ఎగబడుతున్నారు.

### వృద్ధులకు దుప్పట్ల వితరణ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్:

స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా పార్వతీపురం టౌన్‌పోలీస్ స్టేషన్‌లో వృద్ధ మిత్ర కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి పలువురు వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు, స్టీల్ గ్లాసులు అందజేశారు. మండలంలోని చినమరికి గ్రామంలో ఎస్సీ,ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న మహిళలకు గ్రామ పెద్దలు గంటా.అప్పలస్వామి, గంటా లక్ష్మి, నామాల గంగ, అలజంగి రాణి, రావుపల్లి నిర్మల, పోలీస్‌సిబ్బంది సమక్షంలో అందజేశారు.

### వనరుల ఆవశ్యకతను చిన్నారులకు వివరించాలి

పార్వతీపురం టౌన్: హిందూతత్వం అంటే మతం కాదని, సమూహ జీవన విధానమని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానందను అంతా స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కోరారు. పునర్వ్ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ శరవణన్ రాజగోపాలన్ ఆధ్వర్యంలో పార్వతీపురం జట్టు ఆశ్రమంలో వివేకానంద జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..ప్రకృతి వనరుల ఆవశ్యకతను చిన్నప్పటి నుంచే చిన్నారులకు వివరించాలని కోరారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యం, అభివృద్ధి, విజ్ఞానానికి సంకేతాలని డిప్యూటీ ఈఓ పి.బ్రహ్మాజీరావు సూచించారు. ఇందులో భాగంగా గాలి, నీరు, భూమి కాలుష్యానికి కారణాలు, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో 'నీపాత్ర' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన, పెయిటింగ్ పోటీలు, సంప్రదాయ వంటలు, పర్యావరణ హితమైన అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు.

**విజేతలకు బహుమతుల అందజేత**

అలాగే ఒకటవ తరగతి విద్యార్థి రితిక్ రెడ్డి వివేకానంద జీవితాదర్శంపై చేసిన ప్రసంగం, జట్టు కళాకారుల బృందం నృత్య ప్రదర్శనలు, యోగాసనాలు, కరసాము, కత్తిసాము తదితర సాహస కృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం గిరిజన ఉద్యోగ సంఘం నాయకుడు నందివాడ కృష్ణబాబు పంపిణీ చేసిన బహుమతులను విజేతలకు అందించడంతో పాటు అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు.

# యువతకు వివేకానంద స్ఫూర్తి

స్వామి వివేకానంద అడుగుజాడల్లో యువత నడవడం ద్వారా ఆధునిక భారతదేశాన్ని నిర్మించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. వివేకానంద జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద ఆశయాలను నెరవేర్చేలా యువత ముందుకు సాగాలని పలువురు పిలుపునిచ్చారు. తద్వారా యువశక్తిని నిరూపించాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గరుగుబిల్లి: తోటపల్లిలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీజీఎఫ్ రీజనల్ కోఆర్డినేటర్ సురేంద్ర తదితరులు



సీతంపేట: వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నిరోషా



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ నంగిరెడ్డి, సర్పంచ్ వెంకటలక్ష్మి తదితరులు



వీరఘట్టం: చిట్టపులివలస పాఠశాలలో వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు




భామిని: స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు సోంబాబు, వెంకటరావు తదితరులు

## ప్రధాన మార్కెట్‌కు పండగ శోభ



ప్రధాన మార్కెట్లో కొనుగోలులో నిమగ్నమైన ప్రజలు

పాలకొండ రూరల్: సంక్రాంతి పండగ నేపథ్యంలో డివిజన్ కేంద్రం పాలకొండ ప్రధాన మార్కెట్ కొత్త శోభను సంతరించుకుంది. పండగ వస్తువులతో పాటు నూతన వస్త్రాలు, మట్టి పాత్రల కొనుగోలు నిమిత్తం ప్రజలు పెద్ద ఎత్తున పట్టణానికి గురువారం రావడంతో సందడి నెలకొంది. వ్యాపార దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా స్థానిక పోస్టాఫీస్ రహదారిలో జనం పోటెత్తారు. ఎస్‌ఐ బి.శివప్రసాద్ మార్కెట్‌తో పాటు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిఘా ఏర్పాటు చేశారు.

## నిషేధిత క్రీడల జోలికి వెళ్లొద్దు : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: సాంప్రదాయ పండగలను ప్రజలు సంతోషంగా నిర్వహించుకోవాలని, నిషేధిత క్రీడల జోలికెళ్లొద్దని పాలకొండ సబ్ డివిజన్ పోలీస్ అధికారి జీవీ కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. జూదం, పొట్టేళ్ల, కోడి పందేలు నిర్వహించటం, వాటిని ప్రోత్సహించటం చట్టరీత్యా నేరమని గుర్తించాలన్నారు. సచివాలయ మహిళా పోలీస్ వ్యవస్థ ద్వారా ఈ తరహా క్రీడల నిర్వహణపై గట్టి నిఘా పెట్టామన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సెక్షన్ 30 అమలు చేయటంతో పాటు సీఐలు, ఎస్ఐలతోపాటు తమ సిబ్బందికి కచ్చితమైన ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. పండగల నేపథ్యంలో దొంగతనాలు అరికట్టేందుకు తగుచర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్తే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించటం, విలువైన వస్తువులు, ఆభరణాలు వారితోసహా భద్రంగా తీసుకువెళ్లటం శ్రేయస్కరమన్నారు. లాక్‌డు హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) అందుబాట్లో ఉందన్నారు. ప్రయాణాలకు సంబంధించి ముందుగా సమాచారం అందించిన గృహాలపై నిఘా ఉంచటం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బంగారు ఆభరణాల మెరుగులు పేరిట జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులను, అవాంఛనీయ ఘటనలు, క్రీడలను గమనిస్తే సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా మార్కెట్, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను వినియోగించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి: మామిడి, జీడిమామిడి తోటల్లో సరైన యాజమాన్య పద్ధతులను నిర్వహిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి ఆర్.వి జయభారతి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ మామిడి, జీడి తోటల్లో పొగ మంచు కారణంగా పూత రాలిపోవడం, పూత మాడిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణ కోసం తగు చర్యలు చేపట్టాలన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పీఓ నవ్య

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సీతంపేట, వీరఘట్టం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ప్రాజెక్టు అధికారి బి.నవ్య సమక్షంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 6 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 4 పోస్టులకు 19 దరఖాస్తులు వచ్చాయని, 2 పోస్టులకు అప్లికేషన్లు రాలేదని సంబంధిత అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘ నాయకులు

గరుగుబిల్లి: ఆర్‌బీకే నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు చేరవేసినప్పటికీ అన్‌లోడింగ్ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని రైతు సంఘం నాయకులు కె.రవీంద్ర ఆరోపించారు. మండలంలోని ఖడ్గవలస సమీపంలో గల మిల్లు యజమానులు రెండు రోజులుగా ట్రాక్టర్ల ద్వారా వచ్చిన ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేయకపోవడంతో మిల్లు గేటు వద్ద ధాన్యంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని రైతులతో పాటు రైతు సంఘ నాయకులు బివి.రమణ తదితరులు కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమాలు



బాబా అలయంలో హోమములో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో గురువారం దేవి సహిత జైగురు దత్త హోమములు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి తదితర పూజలు నిర్వహించారు. బాబాకు విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌విఎల్ఎన్.శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎన్.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శ్రీజైగురుదత్త హోమములు జరిపారు. హోమములో పాల్గొన్న పది మంది దంపతులకు దీక్షా వస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## నర్సరీ ప్రారంభం



మొక్కలు పంపిణీ చేస్తున్న డీఎఫ్ఓ ప్రసూన

సాలూరు: పట్టణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ నర్సరీని డీఎఫ్ఓ ప్రసూన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నర్సరీని సద్వినియోగం చేసుకుని ప్రకృతిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలకు వివిధ రకాల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ రామారావు, అధికారులు రామకృష్ణ, గంగరాజు, దేవరాజు, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

# అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



ఎమ్మెల్యే కళావతికి హారతులు పడుతున్న మహిళలు

**పాలకొండ ఎమ్మెల్యే కళావతి**

సీతంపేట: అర్హుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని, దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పుబ్బాడ గ్రామ సచివాలయ పరిధిలో పుబ్బాడ, పుబ్బాడగూడ, మీనకోట, పల్లంకివలసలు, గుజ్జి తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లారు. వీరికి గిరిజన మహిళలు హారతులతో స్వాగతం పలికారు. సంక్షేమ పథకాల కరపత్రాల ద్వారా ఇంటింటికి ఎంత మొత్తం అందిందో వివరించారు. అవ్వా తాతలకు పింఛన్ అందుతుందా..., అమ్మా అమ్మ ఒడి డబ్బులు పడ్డాయా.... అన్నా రైతు భరోసా వచ్చిందా... అక్కా చేయూత డబ్బులు బ్యాంకు ఖాతాలో జమయ్యాయా, అందరూ బాగున్నారా? అంటూ ఒక్కొక్కరిని ఎమ్మెల్యే ఆప్యాయతతో పలకరించారు. ఇంకా ఏమైనా పెండింగ్ సమస్యలు ఉంటే వార్డు సచివాలయాల్లో ఫిర్యాదులు చేస్తే పరిష్కారమవుతాయన్నారు. వరద గోడలు, డ్రైనేజీ, హౌసింగ్ బిల్లులు, విద్యుత్ సమస్యలు చెప్పగా ఈ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో జరగనంత అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లలో చేసి చూపించారన్నారు. జగనన్న ప్రభుత్వంలో పార్టీలు, కులాలు, వర్గాలు, మతాలు అని చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు వర్తిస్తున్నాయన్నారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా ఖాతాదారుల బ్యాంకు ఖాతాలకే నిధులు జమ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ హెచ్.మోహన్‌రావు పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం తగదు



ఎం.సింగుపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో అలసత్వం తగదని ఎంపీడీఓ డొంక త్రినాథులు స్పష్టం చేశారు. పాలకొండ మండలంలోని నవగాం, డోలమడ, జంపరకోట, ఆర్‌బీఆర్ పేట, బర్న, బద్దుమాసింగి, చిలకలవలస తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. ఆన్‌లైన్ హాజరుపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు శతశాతం పనులు చేపట్టాలని, వేతనదారులకు పనులు కల్పించాలన్నారు. సచివాలయాలను సందర్శించి అక్కడి రికార్డులు పరిశీలించారు. పలు సచివాలయాలకు సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరుకాకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎంజేఏవై, గ్రామీణ గృహ నిర్మాణ పనులు, ఇతర సంక్షేమ పథకాల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికులే కీలకం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాంలు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పడేందుకు కార్మికుల కృషే కీలకమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు పండగ సందర్భంగా యూనిఫాంలు గురువారం అందజేశారు. 62 మంది కార్మికులకు రెండు జతల చొప్పున యూనిఫాంలు అందించారు. వీటితో పాటు కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ సమయంలో కార్మికులకు వీటిని అందించడంపై ఆనందం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేసి ప్రజల ఆరోగ్యం కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ ఛైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వర రావు, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, నీలాపు శ్రీనివాసరావు, కిల్లారి మోహన్, కడగల రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగుల బాధ నుంచి తప్పించండి



ఎమ్మెల్యే కళావతికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భామిని: గడిచిన మూడేళ్లగా ఏనుగుల గుంపుతో పడుతున్న బాధల నుంచి తప్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి గురువారం విన్నవించారు. మూడేళ్లగా తాము పండించే పంటలు పాడు చేయడంతో పాటు, మోటార్లు, బోర్లు, వాటి పైపులను ధ్వంసం చేసి తీవ్ర నష్టాలకు గురి చేస్తున్నాయని వాపోయారు. వీటి బారి నుంచి తప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కిల్లారి పాల్గుణరావు, మండల ధార్మిక మండలి అధ్యక్షుడు వై.అప్పలనాయుడుతో పాటు పలువురు రైతులు ఉన్నారు.

## రూ.62 కోట్లతో తాగునీటి పథకం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు



నాడు–నేడు స్కూల్ భవనం పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల బృందం

భామిని: మండలంలో రూ.62 కోట్ల వ్యయం కాగల మంచినీటి పథకం మంజూరైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకరరావు గురువారం తెలిపారు. లివిరి, భామిని, సింగిడి ప్రాంతాల్లో డీఈఈ పి.ఢిల్లీశ్వరరావుతో కలిసి బుధవారం పర్యటించారు. నీటి పథకాలు, నాడు–నేడు పాఠశాల భవనాల నిర్మాణాలను పరిశీలించారు. జాతీయ జలజీవన్ పథకంలో భాగంగా మండల వ్యాప్తిగా తాగునీరు అందించేందుకు మాస్టర్ ప్లాన్ ప్రకారం మంజూరైందన్నారు. ఈ పథకంలో సింగిడి వద్ద వంశధార నది నుంచి నీటిని ఇన్‌ఫిల్టర్ వెల్స్‌లోకి పంపించి బురుజోల కొండపై ఏర్పాటు చేసే భారీ ట్యాంక్‌కు తరలిస్తామన్నారు. ఈ భారీ పథకంతో భామిని మండలంలోని 87 హేబిటేషన్లలో 54 హేబిటేషన్లకు పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్టు తెలిపారు. వారి వెంట ఏఈఈ అమరాన సందీప్, వీఈఏ ప్రియాంక, ఉపాధి ఎఫ్ఏ వెంకటరమణ ఉన్నారు.

## వారపు సంతలో సంక్రాంతి శోభ



వారపు సంతలో కిక్కిరిసిన కొనుగోలుదారులు

భామిని మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతలో సంక్రాంతి సందడి కనిపించింది. ఉదయం నుంచే తరలివచ్చిన జనంతో పండగ కొనుగోళ్లు పెరిగాయి. సంక్రాంతి ముందు సంత కావడంతో జనంతో కిటకిటలాడింది. కొనుగోలుదారులతో సంతలో సంక్రాంతి సందడి కనిపించింది. ఇదే సమయంలో కొనుగోళ్లు బాగా పెరగడంతో వ్యాపారులు సంబరపడ్డారు. గొర్రెపోతులు, మేకలు, కోళ్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. మహిళలు రంగులు, గాజులు, ఇతర కాస్మోటిక్ వస్తువులు కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. సంక్రాంతి రోజు పెద్దలను పూజించేందుకు అవసరమైన అన్ని రకాల వస్తువుల కొనుగోలుతో సంతలో సందడి వాతావరణం నెలకొంది.

– భామిని



అలంకరణ సరుకులు ఎంచుతున్న మహిళలు



సంక్రాంతి పండగ కోసం చెరకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు